విశాలాంధ్ర శ్రీకాకుళం
మంగళవారం 13, ఆగస్టు 2024

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర -శ్రీకాకుళం: భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శనివారం స్థానిక ప్రభుత్వం బాలుర డిగ్రీ కళాశాల మైదానంలో వివిధ శాఖల అధికారులతో ఆయన పరిశీలించారు. పారిశుద్యం, త్రాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలు పై అధికారులకు సలహాలు సూచనలు అందజేశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, డి.ఎస్.పి.శేషాద్రి నాయుడు రెవిన్యూ డివిజనల్ అధికారులు సి.హెచ్ రంగయ్య, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, ఆర్ అండ్ బి ఎస్సీ జాన్ సుధాకర్, శ్రీకాకుళం తహసిల్దార్ గణపతి రావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నారాయణపురం కుడి ప్రధాన కాలువ

చివర ఆయకట్టుకు సాగునీరు అందించండి : ఏపీ రైతు సంఘం

ధర్నా చేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎచ్చెర్ల మండలం 13 గ్రామాలకు చెందిన నారాయణపురం కుడి ప్రధాన కాలువ చివరి ఆయకట్టు రైతులు సాగునీరు ఇవ్వాలని కోరుతూ ధర్నాచేశారు. తదనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) లో జిల్లా కలెక్టర్ కి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, ఎచ్చెర్ల జడ్పిటిసి సనపల నారాయణ రావు లు మాట్లాడుతూ గత 15-20 ఏళ్లుగా పంట పైన పెట్టిన వేలాది రూపాయల పెట్టుబడులు నేలపాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్లో సాగునీరు అందక రైతులు తమ వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నామని, తక్షణమే కాలువల గట్టులను పటిష్టం చేయాలని కోరారు. షట్టర్స్ ఏర్పాటు చేసి ప్రతి 5 కిలోమీటర్లకు ఒకరిని చొప్పున సీజనల్ లస్కర్ ను నియమించి సాగునీరు ఆయకట్టు చివరి వరకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నారాయణపురం ఆనకట్ట వద్ద ఉన్న అడ్డుకట్ట తలుపులు వరద ప్రవాహానికి పడిపోతున్నాయని వాటిని మరమ్మతులు చేపట్టి ఎప్పటికప్పుడు సరిచేసి నదిలో నీరు వృధాగా సముద్రంలో కలిసిపోకుండా ఆయకట్టు భూములకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లు సూర్యనారాయణ, జరుగుళ్ళ శంకర రావు, బల్లాడ జనార్ధన రెడ్డి,నక్క కృష్ణమూర్తి, బొడ్డేపల్లి సుధాకర రావు, నేతింటి నీలమప్పడు, జరు గుళ్ళ కృష్ణ, బగ్గు రాజారావు,బగ్గు శ్రీరాములు,నక్క వైకుంఠం,నక్క భూషణరావు, అరసవల్లి రామారావు, గుండ రవి, బెందు రామారావు, మంత్రి కిషోర్, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు. రైతుల ఆందోళనకు సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మద్దతు తెలిపారు. రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ లోకనాథం, యువజన సంఘం నాయకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి ...

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-టెక్కలి: నియోజకవర్గ వ్యాప్తంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను సంరక్షించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయి రెవెన్యూ హౌసింగ్ శాఖ అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను సంరక్షించాలని, నిరుపయోగంగా ఉన్న భూములను గుర్తించి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. టెక్కలిలో గత ఐదేళ్ల వైసిపి హయాంలో జరిగిన భూ అక్రమాలను గుర్తించి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. టెక్కలి స్వర్ణకారుల స్థల అక్రమ విక్రయాలు నిలుపుదల చేయటం, ఆస్పత్రుల వద్ద అక్రమణలు, జగనన్న కాలనీ అక్రమాలపై విచారణ చేయాలని తదితర అంశాల పై అధికారులతో చర్చించారు. ఆక్రమణదారులకు సహకరించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ సుదర్శన దొర, నాలుగు మండలాల తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య ప్రమాణాల కల్పనే 'కూటమి' ధ్యేయం

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట/పోలాకి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య ప్రమాణాల కల్పనే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకి మండలంలోని అంపలాం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ అండ్ పి గ్లోబల్, ఐ.ఎన్.సి కంపెనీ సి.ఎస్.ఆర్ యాక్టివిటీ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే, రమణమూర్తి ప్రారంభించారు. ముందుగా మండలంలోని నందిగాం గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంపలాం పంచాయితీలో త్రాగు నీటి సమస్య గురించి తన దృష్టికి తెచ్చారని, సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే నందిగాం గ్రామ స్మశానానికి సరైన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంధర్భంగా అంపలాం గ్రామంలో పాఠశాల సచివాలయం స్థలదాత, సదాశివుని చంద్రశేఖరరావును, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన పొట్నూరు వరప్రసాద్‌కు ఎమ్మెల్యే, రమణమూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్, డోల జగన్మోహన్‌రావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ సర్పంచ్, లుకులాపు రాంబాబు, టిడిపి ప్రతినిధులు, నల్లాన వెంకునాయుడు, సూరపు నారాయణరావు, ఉప్పాడ అప్పలరెడ్డి, గ్రామ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, టిడిపి, జనసేన, బిజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పలాస: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సోమవారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు చాపర వేణుగోపాల్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాపర వేణుగోపాల్,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి మాట్లాడుతూ"స్వాతంత్రం మా జన్మహక్కు"అని భారత జాతి ఎలుగెత్తి నినదిస్తున్న తరుణంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మొట్టమొదటి జాతీయ విద్యార్థి సంఘంగా ఆవిర్భవించిందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలనకు సమాధి కట్టడంలో అగ్రభాగాన నిలిచిందని, నాటి నుండి నేటి వరకు దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి పోరాటాల మార్గాన్ని ఎంచుకుందని అన్నారు. మార్క్సిజం లెనినిజం తన ఊపిరిగా, శాస్త్రీయ సోషలిజం తన గమ్యంగా, సెక్యులరిజాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం తన కర్తవ్యమని సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 88 సంవత్సరాలు పూర్తిచేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థి మిత్రులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్,జస్వంత్,రాహుల్,జీవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఐటీడీఏ పీవో రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-మందస: గిరిజన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి టి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు.సోమవారం మందస మండలం చీపి గ్రామంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే గ్రీవెన్స్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని దీనిని గిరిజనులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. అనంతరం పలువురు గిరిజనులు తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిడి అన్నన్న దొర,మందస ఎంపిడిఓ ఏ.రఘుపతిరావు, డిటి ఎం. కృష్ణమూర్తి, డిఈఈ శ్రీనివాసరావు, ఏటిడబ్ల్యూఓ ఎం శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ భవానీశంకర్ మృతి



విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 16వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ కౌన్సిలర్ డబ్బీరు భవానీశంకర్ (63) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పలాస కిడ్నీ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. భవానీశంకర్ ప్రస్తుతం పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు భవానీ భౌతికాయాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. భవానీ ఏకైక కుమారుడు శ్రీనివాస్ ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ)లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. తండ్రి మృతి సమాచారం తెలుసుకున్న వెంటనే దుబాయి మీదుగా సోమవారం రాత్రి స్వగ్రామానికి చేరుకుంటారు. భవానీ అంత్యక్రియలు మంగళవారం కాశీబుగ్గ శ్మశాన వాటికలో నిర్వహిస్తారు. అందరిలో ఒకరిగా ఎవరికి ఏ అపద వచ్చినా ఆయన ముందుంటారని భవానీ సన్నిహితులు దుర్గాశంకర్ పండా, పోతనపల్లి హరి, బోర క్రిష్ణారావులు తెలిపారు. ఇటీవల కుమారుడు శ్రీనివాస్ వద్దకు జర్మనీ వెళ్లి గత నెల 15న భవానీ స్వగ్రామం పలాసకు చేరుకున్నారు. నెల పూర్తికాక ముందే ఆయన మృతి చెందడం అందర్ని కలచి వేసింది. భవానీ మృతదేహాన్ని మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, పలాస కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ సభ్యులు సిహెచ్ జగదీష్, నేతాజీ, డి.మహారణ, రవిశంకర్, కింజరాపు క్రిష్ణ, రమణలు భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. భవానీ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ: మండలంలో రామకృష్ణాపురం ఉజ్జిడి మెట్ట సమీపం లో ఉన్న భూముల రైతులకు న్యాయం చేయాలని వామపక్ష రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం పలాస ఆర్డీవో కార్యాలయంలో బాధిత రైతులతో కలిసి వామపక్ష రైతు సంఘాల నాయకులు పలాస ఆర్డీవో భరత్‌నాయిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.గణపతి, చాపర వేణుగోపాల్, మద్దిల రామారావు, కుత్తుం వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ గతంలో ఉజ్జిడి మెట్టకు అనుకొని ఉన్న భూములను కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారని, ఆందోళన చేసి కాపాడుకున్న భూములకు పూర్తి హక్కు స్వాధీన పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాది క్రితం రైతుల భూములను సర్వే చేసి హక్కు పత్రాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఆర్డీవో భరత్‌నాయిక్ స్పందిస్తూ రైతుల వివరాలు, పట్టాలు, భూ హక్కు పత్రాలను తమకు అందజేస్తే రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో గొరకల బాలకృష్ణ, దమయంతి, లక్ష్మమ్మ, గంగమ్మలు ఉన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరణ

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో సిఐటియు, ఎ.పి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కేరళ వరద బాధితులకు సహాయ నిధికి విరాళాలు సేకరణ చేపట్టారు. ఇటీవల కేరళలో సంభవించిన వర్షాలకు వయనాడ్ జిల్లా అతలాకుతలం కావడంతో వందలాది మంది మృతి చెందగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకోవాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందని, అందులో భాగంగా జంట పట్టణాల్లో 5484 రూపాయలు విరాళాలు సేకరించామని, ఈ మొత్తాన్ని కేరళ ప్రభుత్వ రిలీఫ్ ఫండ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్.గణపతి, టి.అజయ్ కుమార్, బి.ప్రసాదరావు, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, ఎం.లావణ్య, జి.జ్యోతి, వి.రజని, బి.సునీతలు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-మందస: సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది సోమవారం మండలంలో గంగ్రుగాం గ్రామ జంక్షన్ వద్ద ఒడిస్సా రాష్ట్రం నుంచి గొప్పిలి మీదుగా వచ్చే పలు వాహనాలు తనిఖీ చేశారు. ఎవరైనా నాటుసారా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు గాని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇంటి పన్ను 'బకాయిలు'పై మండిపడ్డ సభ్యులు

మేజర్ పంచాయితీలో 'బార్'కు అనుమతులెవరిచ్చారు?

పంచాయితీ పాలకవర్గ సమావేశంలో ప్రశ్నించిన 'వార్డు మెంబర్లు'

విశాలాంధ్ర -నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయితీ సమావేశ మందిరంలో సోమవారం పంచాయితీ సర్వసభ్య సమావేశం వాడిగా, వేడిగా జరిగింది. మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు ఆధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గత పదేళ్ళ నుండి పంచాయితీకి రావాల్సిన ఇంటి పన్ను బకాయిలపై పంచాయితీ అధికారులు దృష్టి పెట్టడం లేదని వైస్ సర్పంచ్, సానుపల్లి కృష్ణబాబు, వార్డు మెంబర్లు, రఘుపాత్రుని శ్రీధర్, పొట్నూరు కృష్ణప్రసాద్, కె.సి.హెచ్.బి.గుప్తా, గొలివి సింహాచలం, పంచాయితీ ఈవో, ఎస్.చిన్నారావుకు ప్రశ్నించారు. అలాగే మేజర్ పంచాయితీలో బార్ రెస్టారెంట్‌కు పంచాయితీ అనుమతులు లేకుండా ఎలా పెట్టారని అడిగారు. పంచాయితీ నిధులు ఇలా వసూలు చెయ్యకుండా వుంటే, పంచాయితీ అభివృద్ధి ఎలా జరుగుతుందని, బకాయిలు చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలని వార్డు మెంబర్లు కోరారు. ఈ విషయమై ఈవో, చిన్నారావు మాట్లాడుతూ గత పదేళ్ళ నుండి ఇంటి పన్ను బకాయిలు వున్నాయని, వీటిని ఈ నెలాఖరు నాటికల్లా వసూలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బార్, రెస్టారెంట్‌కు పంచాయితీ నుండి గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్.ఓ.సి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో ఉధృతంగా జ్వరాలు ...ఆందోళనలో ప్రజలు

విశాలాంధ్ర-మందస: మందస పట్టణంతో పాటు మండలంలోని గిరిజన ప్రాంతం, ఉద్దానం, మైదాన ప్రాంతాల్లోని గ్రామాల్లో చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ జ్వరాలతో వందలాదిమంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మండలంలో ప్రభుత్వపరంగా ఆసుపత్రులు ఉన్నప్పటికీ రోగులకు సేవలు అందించడంలో వైఫల్యం చెందుతున్నాయన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉన్న పి.హెచ్.సిలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. వివిధ రకాల జ్వరాలతో అనారోగ్యం పాలైన బాధితులు పలాస, సోంపేట ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఆర్థిక స్థోమత లేని బాధితులు గ్రామాల్లో స్థానికంగా ఉన్న ఆర్.ఎం.పిలు నిర్వహిస్తున్న క్లీనిక్‌లకువెళ్లి వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వాసుపత్రులు పట్ల విశ్వాసం కలిగించే విధంగా వైద్యులు సేవలు మృగ్యం కావడంతో ప్రైవేటు వైద్యుల సేవలు కోసం జ్వర పీడితులు, ఇతర రకాల అనారోగ్యంతో బాధ పడుతున్న బాధితులు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్న ఆవేదన బాధితుల్లో నెలకొంది. జ్వరాలతో బాధలు పడుతున్న బాధితులు ప్రైవేటు క్లీనిక్‌లలో వివిధ రకాల రక్త పరీక్షలు చేసుకుంటున్నారు. దీంతో ఆర్థిక పరంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించి గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

కొళాయి నీరు ఆరు గంటలకే విడిచి పెట్టాలి

విశాలాంధ్ర-టెక్కలి: కొళాయి త్రాగు నీరు ఆరు గంటలకే విడిచి పెట్టాలని స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజు చిట్టిబాబు, మోర్చ్ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ సుదర్శన్ దొర కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ తో మాట్లాడుతూ టెక్కలి మేజర్ పంచాయతీలో త్రాగునీరు కొళాయి 7:30 నిమిషాలకు విడిచి పెడుతున్నారని, దీనివలన దూర ప్రాంతం వివిధ పనులకు వెళ్లే కూలీలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, బస్సులపై వెళ్లే ఉద్యోగస్తులు సమయానికి భోజన తయారు కాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 8 గంటల వరకు త్రాగునీరు కొళాయి దగ్గరే ప్రజలు ఉంటే ఇంకా మిగతా పనులు కోసం వెళ్లే వాళ్ళు సమయం లేక చాలా అవస్థలు పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించి త్రాగునీరు కొళాయి ఉదయం 6 గంటలకే విడిచి పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డివిజనల్ స్థాయి పోటీల్లో తాడివలస విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర -పొందూరు: నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం గవర్నమెంట్ హైస్కూల్ లో "జీవవైవిధ్యం కాపాడడంలో యువత పాత్ర"అంశంపై జరిగిన డివిజనల్ స్థాయి డిబేట్ పోటీల్లో తాడివలస ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని హారిక ప్రథమ స్థానంలో నిలిచిందని, అలాగే ఇదే అంశంపై జరిగిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో కూడా తాడివలస ఉన్నత పాఠశాల షార్ట్ ఫిల్మ్ ప్రథమ స్థానంలో నిలిచి మంగళవారం జరుగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, నేషనల్ గ్రీన్ కోర్ ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న తెలిపారు. విద్యార్థులు ప్రతిభ కనబర్చడం పట్ల విద్యార్థులను జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి అభినందనలు తెలిపారు.

ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి,చట్ట ప్రకారం పరిష్కారానికి చొరవ చూపాలి : ఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి,చట్ట ప్రకారం పరిష్కారానికి చొరవచూపాలని పోలిసు అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి,వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా వృద్దులు వికలాంగులు వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. 50 పిర్యాదులు అందాయని. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.

యువత మేల్కో... మత్తు వద్దు.. జీవితం ముద్దు..

విశాలాంధ్ర -హిరమండలం: మాధకద్రవ్యాలు వాడకం వలన యువత జీవితం నాశనం అవుతుందని యువత మేల్కొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో సుఖంగా జీవించాలని హిర మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి ఈశ్వరసత్యనారాయణ పట్నాయక్ అన్నారు. సోమవారం హిరమండలం ఎబి రహదారి గుండా కళాశాల విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులతో మాధకద్రవ్యాల నిషేధం పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తో మత్తు మందు వాడకం ద్వారా యువత ఎంతో జీవితం కోల్పోతుందని నినాదాలు చేశారు. మద్యం, గంజాయి, సిగిరెట్, డ్రగ్స్ వాడకం వలన జీవితం సర్వ నాశనం అవుతుంద ని ప్రిన్సిపాల్ తెలిపారు. జీవితం లో ఉన్నత శిఖరాలు ఎక్కాలంటే చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థుల కు ప్రిన్సిపాల్ పిలుపు నిచ్చారు.

చల్లవానిపేట జడ్పీ హైస్కూల్ కు రక్షణ గోడ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర -జలుమూరు: జలుమూరు మండలం చల్లవాని పేట జిల్లా పరిషత్ హై స్కూల్ కు రక్షణ గోడలేక విద్యార్థిని, విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. నరసన్నపేట పాతపట్నం వెళ్లే హైవే రహదారి పక్కన ఈ పాఠశాల ఉండడం ఏ క్షణాన్న ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెపుతున్నారు. గతంలో ఉన్న రక్షణ గోడ రోడ్ల నిర్మాణ పనుల్లో నేలమట్టమయింది. రక్షణ గోడ లేనందున విద్యార్థులు నిరంతరం భయం భయంతో కాలం గడుపుతున్నారు. పాలకులు అధికారులు పరిశీలించి తక్షణమే హైస్కూల్ కు రక్షణ గోడ కల్పించాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరారు.

గ్రంధాలయం లో ప్రముఖులకు సన్మానం

విశాలాంధ్ర -హిరమండలం: సోమవారం శాఖా గ్రంధాలయం హిరమండలంలో ఎస్ ఆర్ రంగనాథం జయంతి ఘనంగా నిర్వహించారు. ఎస్ ఆర్ రంగనాథం జయంతి సందర్భంగా పాతపట్నం గ్రంథాలయ అధికారి కాలరాజు గ్రంథాలయంలోకూడా ఘనంగా జయంతిని జరిపించారు, అందులో భాగమే గ్రంధాలయ అధికారులకు మరియువారి తోటి ఉద్యోగస్తులకు సన్మానం చేయడం జరిగిందని హిరమండలం గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ కు సన్మానం చేయడం జరిగిందని ఎర్రమ్మ తెలిపారు.

మండల సమైక్య అధ్యక్షురాలిగా భానుమతి

విశాలాంధ్ర -నంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం మండల మహిళా సమైక్య అధ్యక్షురాలుగా చెట్ల తాండ్రకు చెందిన పంగ భానుమతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షు రాలుగా సిహెచ్ డి ల్లేశ్వరి (మరువాడ), డి.వేణమ్మ, (సంతబొమ్మాళి), సెక్రటరీగా బీ. హేమలత (వడ్డీతాండ్ర), కోశాధికారిగా, డి.విజయలక్ష్మి,(కొల్లిపాడు)ఎన్నికైనట్లు ఏపీఎం, టి. సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సి సి లు, వి ఓ లు, సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండలం రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. సీనియర్ డీలర్ కొత్తకోట నాగరాజు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పండి ప్రసాద్, కోశాధికారిగా బేసి శాంతి, ప్రధాన కార్యదర్శిగా నరేష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా సానా వెంకటరావు ఎన్నికయ్యారు. అనంతరం కంచిలి తహశీల్దార్ జయలక్ష్మిని కలిసి నూతన డీలర్ల కమిటీ వివరాలను అందజేశారు.

కాకినాడ శ్రీ ఆదిత్య లో ఘనంగా లైబ్రేరియన్ డే

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ డే ను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ వి వేణుగోపాలరావు మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంచుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థి దశలో గ్రంథాలయాలకు వెళ్లి చదవడం అలవాటు చేసుకుంటే ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని ఆయన కోరారు. లైబ్రేరియన్ పి. కృష్ణారావు మాట్లాడుతూ రంగనాథన్ తిని లైబ్రేరియన్ డే గా జరుపుకోవడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో ఐస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ పిఓ ఎం నాగభూషణ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే అశోక్ వినతి అందజేసిన ఆశ వర్కర్లు

విశాలాంధ్ర-కవిటి: ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో 2024 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలు వెంటనే విడుదల చేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే అశోక్ కు నియోజకవర్గం ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే అశోక్ క్యాంపు కార్యాలయం రామయ్యపుట్టగలో ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ కు కలిసి ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారుల యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలు జీవోను వెంటనే విడుదల చేయాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి జిల్లాలో జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు రాధ, వరలక్ష్మి, శ్రీదేవి, సరస్వతి, కేశవమ్మ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట మరిచిన కూటమి ప్రభుత్వం

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు రమణమూర్తి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: 117 జీఓ ను రద్దు చేయా లని ఉపాధ్యా య సంఘాలు పోరాటాలు చేస్తే యువగళం పాదయాత్ర లో నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని హామీ నిచ్చి ఈ రోజు జి ఓ రద్దు చెయ్యడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థకావడం లేదని ఎస్ టీ యూ జిల్లా అధ్యక్షులు ఎస్ వి రమణమూర్తి అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదిక పక్షాన గార మండల విద్యాశాఖ అధికారి ఎన్. రామకృష్ణ కి, అసంబద్ధంగా ఉన్న ఉపాధ్యాయుల పని సర్దుబాటును బహిష్కరిస్తూ సోమవారం నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఈ ఉత్తర్వులతో పని సర్దుబాటు చేసినట్లయితే, ప్రీ హైస్కూల్లో ఆరుస్కూల్ అసిస్టెంట్ పోస్టులు పోయి, నలుగురు ఎస్జీటీలు వస్తారు. దీనివలన సబ్జెక్టు బోధన ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. ముఖ్యంగా 117 జీవో వలన మూడు, నాలుగు, ఐదు తరగతులు హైస్కూల్లో మెర్జి చేయడం వలన ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయన్నారు. తక్షణమే ఈ జీ ఓ రద్దు చేస్తూ పని సర్దుబాటును చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, గోవిందరావు, అర్జున్ రావు యుటిఎఫ్, కే.సురేష్ కుమార్, ఎల్ బాబ్జి, ఎంవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ రక్షిత భవనం మరమ్మతులకు వినతి

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం తీర గ్రామమైన రామయ్యపట్నంలో నిర్మించబడిన తుపాన్ రక్షిత భవనం శిధిలావస్థకు చేరిందని మర్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు టీడీపీ నేత రామయ్యపట్నానికి చెందిన మద్దు రాజారావు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

మేమున్నాం సేవా సంఘం ఆర్థిక సాయం

విశాలాంధ్ర-రణస్థలం : మేమున్నాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, జే ఆర్ పురం-1 ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుళ్ళ సాయిరాం, తన భార్య దేవయాని తో కలిసి ఒక నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం చేసి దాతృత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక జే ఆర్ పురం గ్రామంలో 20 సంవత్సరముల కిందట బ్రతుకుతెరువు నిమిత్తం వెస్ట్ బెంగాల్ నుంచి వివిఎన్ కుకే, రూప కుటుంబం రణస్థలం గ్రామానికి వచ్చారు. అప్పటి నుంచి సాఫీగా సాగుతున్న వారి కుటుంబానికి రెండు సంవత్సరముల క్రిందట కిడ్నీ వ్యాధి రూపంలో ఒక మహమ్మారి దాపురించింది. అప్పటినుండి ఆ కుటుంబం ఆర్థికంగా చిద్రమై చితికిపోయింది. రెండు కిడ్నీలు పాడై నిస్సహాయ స్థితిలో మంచంపై పడి ఉన్న వివిఎన్ కుకే మాస్టార్ని స్థానికుల సాయంతో తన భార్య రూప వీవియన్ ని ఆసుపత్రిలో జాయిన్ చేసి కొంత బాగు చేసుకుంది. అయితే రెండు కిడ్నీలు పాడైపోయినందున డయాలసిస్ ప్రక్రియ నిరంతరం కొనసాగించవలసి ఉండగా ఆర్థిక స్తోమత లేక డయాలసిస్ చేయించుకోలేక మరల మంచం పట్టి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆ సమయంలో వివిఎన్ కుకే మాస్టారు రూప పనిచేసిన ప్రైవేట్ స్కూలు యాజమాన్యం, తోటి సిబ్బంది చేసిన ఆర్థిక చేయూతతో మరల డయాలసిస్ చేసుకుని కొంతవరకు నయం చేసుకుంది. ఇదిలా ఉండగా రూప తల్లి కూడా అనారోగ్యంతో మంచం పట్టి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఒకవైపు భర్త ఆరోగ్యం క్షీణించి మంచం పట్టగా, మరోవైపు తన తల్లి మృతితో రూప పడుతున్న మానసిక క్షోభను చూసి ఇరుగుపొరుగువారు కన్నీటి పర్యంతమయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో స్థానిక మేమున్నాం సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాయిరాం తన పుట్టిన రోజున ప్రతి సంవత్సరం సతీ సమేతంగా ఒక పేద కుటుంబానికి సాయం చేయడం ఆనవాయితీగా ఉన్నందున సోమవారం వివియన్ కుటుంబానికి డయాలసిస్ నిమిత్తం కొంత ఆర్థిక సాయం చేసి దాతృత్వం దాటుకున్నారు. వివేన్ కుటుంబం సాయిరాం దంపతులకు ఆ భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పని సర్దుబాటు... విద్యా వ్యవస్థకు తీరని అన్యాయం

విశాలాంధ్ర-మందస : ఉపాధ్యాయుల పని సర్దుబాటు విద్యా వ్యవస్థకు తీరని అన్యాయం జరుగుతుందని ఈ ప్రక్రియను విరమించాలని మండల ఫ్యాప్టో గుంట కోదండరావ్, రాజాన పరమేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటును వ్యతిరేకిస్తూ సోమవారం మండల విద్యాశాఖాదికారి 1 ఎం లక్ష్మణరావు,విద్యాశాఖాధికారి 2 ఎం భాస్కరరావు లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించిన ఆన్లైన్ సమావేశంలో సమస్యలు గురించి ప్రస్తావించినప్పటికి వేటిని పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సీనియార్టీ అనే ఒక చిన్న డిమాండ్ మాత్రమే పరిగణనలోకి తీసుకుని జిఓ 117 మరియు 128 ఆధారంగా పని సర్దుబాటు చేయడం వలన పాఠశాల విద్యా వ్యవస్థకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కాబట్టి జిఓ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలనీ, పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్‌లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని, సీనియార్టీని లెక్కించినప్పుడు ప్యానల్ నంబర్ లేదా ర్యాంక్ ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలనీ, పని సర్దుబాటు చేసేటప్పుడు ఉపాధ్యాయుని స్వంత మేనేజ్మెంట్‌లోగల ఖాళీలలో భర్తీ చేసిన తర్వాతనే ఇతర మేనేజ్మెంట్ లలో నియమించాలనీ, 70% పైబడి అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను పని సర్దుబాటు ప్రక్రియ నుండి మినహాయించాలని కోరారు. 2025 ఏప్రిల్ 30లోపు పదవీ విరమణ చేయు ఉపాధ్యాయు లను పని సర్దుబాటు నుండి మినహాయించాలని, వారి పోస్టు అదనంగా ఉండాలని, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలనీ, 5 నుండి 10 తరగతులు 10 సెక్షన్లు దాటిన సందర్భంలో 2వ హిందీ, 2వ పిఎస్ పోస్టులను కేటాయించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో జిఓ 60 మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలనీ, సర్దుబాటు ప్రక్రియను మండల స్థాయిలో మాన్యువల్ గా నిర్వహించాలని, అవసరాన్ని బట్టి మాత్రమే మిగులు మిగులు పోస్టులను నిర్ణయించి సర్దుబాటు ప్రక్రియ చేయాలన్నారు.ప్రాధాన్యత కేటగిరీ క్రింద బదిలీ పొందిన వారికి డివిజన్ స్థాయి సర్దుబాటు నుండి మినహాయింపు ఇవ్వాలని, స్టడీ లీవ్, మెటర్నీటి లీవు తదితర దీర్ఘకాల సెలవులో ఉన్న ఉపాధ్యాయులు ఉన్న చోట పని సర్దుబాటు నుండి మినహాయింపునివ్వాలని కోరారు. సమాంతర పాఠశాలల్లో ఉర్దూ, తెలుగు తదితర పోస్టులను వర్క్ సర్దుబాటు మినహాయించాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మాత్రమే ఎస్‌ఏ (పిఇ), పిఇటిలను అదే మండలంలో పని సర్దుబాటు చేయాలనీ, సిబిఎస్సి పాఠశాలలను పని సర్దుబాటు నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించే ముందు ఉపాధ్యాయ సంఘాలతో భౌతికంగా సమావేశాలు నిర్వహించాలని కోరారు. లేనియెడల పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మందస మండల ఫ్యాప్టో నాయకులు గున్న రమేష్, దాసరి ఈశ్వరరావు, జగదీష్ బడిత్య, నల్ల ఢిల్లీ, ప్రభాకర్ పట్నాయక్, బి బైరాగి, జి లోహిదాస్యుడు, కృష్ణచంద్ర మహంతి శంకర్ మహరాణ సంపతిరావు రామచంద్ర, దుగాన మాధవరావు, సత్యానంద బెహరా తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-కవిటి: మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు.ఈ మేరకు సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో డ్రగ్ రహితంగా మార్చేందుకు దృఢ సంకల్పంతో నాదేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి నా శక్తి మేరకు నేను శ్రమ పడతానని అధికారులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రామచంద్రరావు, పిఓపిఆర్డి శివాజీ పాణిగ్రాహి, ఏపీఎం గోవిందరావు, వీఆర్వోలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో... డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు అన్నారు.ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులుచే ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలు,డ్రగ్స్ జోలికి పోకుండా,ఎవరినీ పోనియకుండా డ్రగ్స్ రహిత శ్రీకాకుళం జిల్లా గాను, డ్రగ్స్ రహిత భారత్ ను నిర్మించుటకు తన వంతు కృషి చేస్తానని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి గుర్తుగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.ఒ. జె.పాపారావు, పి.హరి, కె.ఉగాది నాయుడు, బి.శ్రీనుబాబు, డి.అనసూయ, కె.కరుణశ్రీ, జి.విష్ణు మూర్తి, బి.అంజన, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ సోదరులకు మనం బాసటగా ఉన్నామనే ధైర్యం ఇవ్వాలి

విశాలాంధ్ర-రణస్థలం : బంగ్లాదేశ్లో ఉన్న మన హిందూ సోదరులకు మనము బాసటగా ఉన్నాము అన్న ధైర్యం చెప్పాల్సిన సమయం వచ్చింది. సర్వేజనా సుఖినో భవంతు అనే ఏకైక జాతి హైందవ జాతి. అలాంటి హిందువులను బంగ్లాదేశ్లో అతి కిరాతకంగా హతమారుస్తున్నారు. హిందూ స్త్రీల మానప్రాణాలను హరిస్తూ, ఆస్తులను కొలగొట్టుతూ, దేవాలయాలను ధ్వంసం చేస్తూ హైందవ హననం గావించబడుతుంది. పసిపిల్లలపై కూడా జాలి లేదు, నిర్దాక్షిణ్యముగా కాలరాస్తున్నారు.

ప్రపంచ హైందవ సమాజానికి బాసటగా నిలవాల్సిన తరుణం ఇది : బంగ్లాదేశ్లోని హిందూవులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ... భారత దేశంలో అక్రమ వలసదారులుగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు దేశంలో చేస్తున్న అరాచకాలను ఆపి బంగ్లాదేశ్ తిరిగి వెళ్ళిపోవాలని హెచ్చరిస్తూ రణస్థలం మండల కేంద్రంలో వివిధ హిందూ సంఘాల కార్యకర్తలునిరసన తెలియచేసారు.

సీనియర్ పాత్రికేయులు పిఏ పంతులు మృతి

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలిలో చాలా ఏళ్లుగా జర్నలిస్ట్ రంగంలో మచ్చలేని వ్యక్తిగా పేరుగాంచిన సీనియర్ జర్నలిస్ట్ పిఏ పంతులు (90) సోమవారం మృతి చెందారు. టెక్కలిలో ఆయన తొలితరం జర్నలిస్టుగా, టెక్కలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పనిచేశారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన ఈనాడు, ఆంధ్రభూమి, కళింగ సీమ, ఉత్తరాంధ్ర ఇలా వివిధ పత్రికలలో పనిచేస్తూ ఆయన సుదీర్ఘకాలం సేవలు అందించారు. ప్రస్తుతం కూడా ఆయన ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా ఉన్నారు. ఈయన మృతి పట్ల పలు జర్నలిస్టు సంఘాలు, వివిధ నాయకులు, తదితరులు తమ ఆత్మ శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తం చేశారు.

పుస్తకపఠనం ద్వారానే విజ్ఞానం పెంపొందుతుంది

విశాలాంధ్ర-మెలియాపుట్టి : పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానం పెంపొందించు కోవచ్చునని పలువురు వక్తలు మాట్లాడారు. గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణిస్తూనే, పాఠకుడికి అవసరమైన పుస్తకాలు అందించడంలో గ్రంథ పాలకుని పాత్ర కీలకమని, గ్రంథాలయ శాస్త్రపిత ఎస్.ఆర్ రంగనాథన్ జయంతోత్సవంను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గ్రంథపాలకుల దినోత్సవాన్ని లైబ్రరియన్ కాల రాజు, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ వారి నేతృత్వంలో సోమవారం నాడు పాతపట్నంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యక్తులు మాట్లాడారు. అనంతరం వివిధ శాఖ గ్రంథాలయాల్లో ఉన్న గ్రంథ పాలకులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా శ్రీకాకుళం నుంచి గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజు, శంకర్రావు, కిరణ్మయి కాలేజీ అధినేత తిరుపతిరావు మాస్టారు, డాక్టర్ జి. వేణుగోపాలరావు, చంద్రభూషణ మాస్టారు, విశ్రాంతి ఎంపీడీవో ఎస్. చిరంజీవి, రామరాజు మాస్టారు, విశ్రాంత బ్యాంక్ పిఓ బాబురావు, దేశం పార్టీ సభ్యులు ఎస్. సతీష్, రామారావు, పలు ఉపాధ్యాయులు, యోగ టీచర్స్, నియోజక వర్గ పరిధిలో వివిధ శాఖ గ్రంథాలయాల గ్రంథా పాలకులు, ప్రజలు తదితరులున్నారు.

38 సంవత్సరాలుగా ప్రైవేట్ భవనంలో శ్రీముఖలింగం వసతి గృహం

విశాలాంధ్ర-జలుమూరు: జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలో 38 సంవత్సరాల నుండి ప్రభుత్వ బాలుర వసతి గృహం అద్దె భవనాల్లో నడుస్తుండడం అనేక విమర్శలకు తావిస్తోంది. పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం లో 1986లో ప్రభుత్వం వెనుకబడిన కులాల విద్యార్థుల కోసం వసతి గృహాన్ని మంజూరు చేసింది. 38 సంవత్సరాలు నిండిన నేటికీ సొంత భవనం లేదు. సుమారు 50 మంది విద్యార్థులు ఉన్న ఇక్కడ సొంత భవనం లేకపోవడం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం భవనం మంజూరు చేసినా నిర్మించేందుకు స్థలాలు లేనందున నేతలు ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నారని ప్రజలు స్పష్టం చేశారు. ఇక్కడ దేవాదాయ శాఖ స్థలాల తప్ప ఇతర స్థలాలు లేవని నేతలు దీనిపై దేవాదాయ శాఖతో చర్చిస్తే దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు అంటున్నారు.

ఆర్ఓ ప్లాంట్ ప్రారంభించాలి : ఎంపిటిసి బుజ్జిబాబు

విశాలాంధ్ర- జికె వీధి : మండలంలోని జికె వీధి పంచాయతీకి చెందిన పికె గూడెం, పాము రాయి, కుంకుంపూడి,పిటిజి గ్రామాలకు 2022లో రక్షిత మంచినీటి పథకం కింద ఆర్ఓ ప్లాంట్ కేటాయించారని, ఎప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదని ఎంపీటీసీ బుజ్జిబాబు అన్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు నిధులు కూడా మంజూరు చేసిందని కేవలం షెడ్లు నిర్మించి, వాటికి సంబంధించిన మెటీరియల్ అందులో ఉంచారు. తప్ప ప్లాంట్ ప్రారంభం ఇప్పటికీ జరగలేదన్నారు. కాంట్రాక్ట్ నిర్లక్ష్యమా, అధికారులు పట్టించుకోలేదో తెలియదు కాని ఆయా గ్రామాల ప్రజలకు రక్షిత మంచినీరు ఇవ్వాలని లేదన్నారు. దీని సంబంధిత అధికారులు ఇప్పటికైనా చొరవ చూపి, ఆర్ఓ ప్లాంట్ ప్రారంభానికి అడ్డంకులు ఏంటో విచారం జరిపి, తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముక్కలి మహేష్, గుంటా బుజ్జి బాబు, గ్రామస్తులు, గెమ్మెలి కామేశ్వరరావు, దావిద్, లక్ష్మణరావు, పాము రాయి గ్రామానికి చెందిన, పాలిక దావిద్, గ్రామస్థులు, పాల్గొన్నారు.

మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర- కురుపాం : కురుపాం మండల న్యాయ సేవా సహాయ కమిటీ ఆధ్వర్యంలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య జోస్పిన్ ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ పరిధిలోని పూతికవలసలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 173మందికి డాక్టర్ సందీప్, డాక్టర్ శు క్రుత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అందించేందుకు 12మందికి కార్పోరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.ప్యానెల్ న్యాయవాదులు బరాటం చంద్ర ఇ.కె.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు, గొటారి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేసిన తర్వాత మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి

విశాలాంధ్ర-పొందూరు: 117 జీవోను రద్దు చేసిన తర్వాత మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని పొందూరు మండల ఫ్యాప్టో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి రామరాజుకు వినతిపత్రం అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా, స్కూలు అసిస్టెంట్లు గా పదోన్నతులు కల్పించి మిగిలిన ఖాళీలను విద్యా వాలంటీర్ల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాటు పేరిట ప్రభుత్వ విద్యను నాశనం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఉపాధ్యాయులపై ప్రేమ నటించి, ఇప్పుడు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని ఆరోపించారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించకుండా హడావుడిగా ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేయడాన్ని వివిధ సంఘాల నాయకులు ఖండించారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి గోపాలరావు, మండల నాయకులు గండెం రామారావు, ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, యుటిఎఫ్ నాయకులు పొందూరు అప్పారావు, ఎపిటిఎఫ్ నాయకులు మొగదాల రమణారావు, కోరుకొండ విజయ్ కుమార్, పిఆర్టీయు నాయకులతో పాటు వివిధ సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్యలో ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఎల్ ఐ సి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నేషనల్ లైబ్రేరియన్స్ డే ను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి,ప్రిన్సిపాల్ కె శివ శంకర్ డా ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. శివ శంకర్ మాట్లాడుతూ ఒక కళాశాలకు గ్రంథాలయం హృదయం వంటిది అని దాన్ని నిర్వహించే గ్రంథపాలకుడు చాలా ముఖ్యమైన వారు అని అన్నారు. అదేవిధంగా రంగనాథన్ గ్రంథాలయాలు కోసం చేసిన సేవలను కొనియాడారు. రంగనాథన్ ప్రవేశ పెట్టిన ఫైవ్ లా స్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ గ్రంథాలయ శాస్త్రానికి ఒక ముఖ్య గ్రంథం వంటిది అని అన్నారు,గ్రంథపాలకులు కూడా ప్రస్తుతం ఉన్న శాస్త్ర సాంకేతిక పై పట్టు సాదించి విద్యార్థులను మార్గదర్శకాలుగా ఉండాలన్నారు,గ్రంథాలయశాస్త్రానికి ఎంతో కృషి చేసిన రంగనాథన్ జయంతి ని జాతీయ లైబ్రేరియన్స్ డే గా నిర్వహించుకుంటున్నాం అని అన్నారు.కళాశాల లైబ్రేరియన్ కమల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినిలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు,నేటి యువత పుస్తక పఠనం పై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అనంతరం కళాశాల గ్రంథాలయ అధికారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, ఎన్ ఎస్ ఎస్ పి ఓ మజ్జి శ్రీనివాసరావు,విద్యార్థినిలు పాల్గొన్నారు.

యువకులు రక్తదానం చేయండి

'ఆ నలుగురు' ట్రస్ట్ సభ్యులు పిలుపు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : యువకులు ముందుకొచ్చి రక్తదానం చేయండి.. నిండు ప్రాణాలను కాపాడుకుందాం అంటూ, నిరుపేద అభాగ్యులకు యువత రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని ఆ నలుగురు ట్రస్ట్ అధ్యక్షులు సాన ఈశ్వరరావు కోరారు. ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో భావనపాడు లో సోమవారము మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 53 యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా.ఆ నలుగురు ట్రస్ట్ అధ్యక్షులు సాన ఈశ్వరరావు మాట్లాడుతూ, గత ఆరు సంవత్సరాలుగా ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో వేల మందికి సరైన సమయానికి రక్తం అందించడం జరిగిందని తెలిపారు, స్వచ్ఛందంగా యువత ముందుకు రావడమే దీని కారణమని అన్నారు. .అలాగే ఎప్పటికీ యువత స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ మరెన్నో వేల మందికి ప్రాణదాతలు అవుతారని కోరారు . గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు ముందుకు వచ్చి రక్త దాతలుగా నిలవాలని ఆయన అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో భావనపాడు గ్రామ యువత రామ్మోహన్,దుర్యోధన, సురేష్, రాజు, సాయికుమార్,జీవితేశ్వరరావు,టెంక.తేజేశ్వరరావు, మన్మధరావు, హేమసుందర్ ,విగ్నేష్, రాజు, నరేష్ , భావనపాడు గ్రామ పెద్దలు గొరకల ఆదినారాయణ, అల్ల దానేసు, కారాడ మురళి, కారాడనీలకంఠం, బై తులసీదాసు, కారాడ పరమేశ్వర రావు ,నీలాపు రాజు, సూరాడ జానకిరావు, సూరాడ గురుభక్తులు, వంక గురుమూర్తి ,తరిణీ కామేశ్వరరావు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలేంటి..?

చీపి ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-మందస: మండలంలోని చీపి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి టి. రాహుల్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు.ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రధానోపాధ్యాయులు కె.సురేంద్రను అడిగి తెలుసు కున్నారు. 160 మంది విద్యార్థులు ఉండాల్సిన ఆశ్రమ పాఠశాలలో 82 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసించడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల తరగతి గదిని పరిశీలించి విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.విద్యా ప్రగతిని పరిశీలించారు. పాఠాలు సక్రమంగా బోధించి శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం వసతి గృహమును,ఆశ్రమ పాఠశాల పరిసరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

యువత సామాజిక బాధ్యతతో మెలగాలి

విశాలాంధ్ర-పలాస : ఆరోగ్యవంతమైన దేశం నిర్మాణం కోసం యువత సామాజిక బాధ్యతతో ఆలోచన చేయాలని లైన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండు దొర అన్నారు. స్థానిక విద్యా వాహిని జూనియర్ కళాశాల లో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సోమవారం యువ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. నేడు యువత పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశలోనే మాదక ద్రవ్యాలకు బానిసపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, విద్యార్థులు తమ జీవితాన్ని కోల్పోతే ఈ దేశం భవిష్యత్తు కోల్పోయినట్టుని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ సమాజంపై యువత బాధ్యత అన అంశంపై రకాల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కార్యదర్శి తమ్మినేని మాధవరవు, కోశాధికారి ఎన్ అప్పారావు, తెప్పల కృష్ణమూర్తి, డాక్టర్ కుమార్ నాయక్, వీరఘట్టపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముందు పదోన్నతులు... తర్వాతే సర్దుబాట్లు

ఉపాధ్యాయ ఐక్యవేదిక డిమాండ్

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ముందు పదోన్నతులు కల్పించి తర్వాతనే సర్దుబాట్లు చేయాలని సోంపేట మండల ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోంపేట మండల విద్యాశాఖాధికారులు జోరాడు, కృష్ణంరాజులకు సోమవారం వినతిపత్రాన్ని సమర్పించారు. అసంబద్ధమైన జీఓ 117ను రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సోమవారం జరుప తలపెట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సిలింగ్‌ను ఉపాధ్యాయులు బాయ్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఎ, యుటిఎఫ్, పిఆర్‌టియు, ఎపిటిఎస్ సంఘాల ప్రతినిధులు ఎన్.మోహనరావు, డి.ఈశ్వరరావు, ఎస్.కూర్మారావు, వై.దాలిబందు, చంద్రశేఖర్, జి.తిరుపతిరావు, కె.హరీష్, జి.రాజేష్, లోకనాథం పట్నాయక్, పురేంద్ర బిసాయి తదితరులు పాల్గొన్నారు.

పలాస ఈఈ గా యోగేశ్వరరావు

విశాలాంధ్ర-పలాస : పలాస 133 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ఈఈ గా యోగేశ్వరరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు గార రాజారావు, కే.గిరీశ్వరరావు, హిమగిరి, ప్రసాద్ పాణిగ్రహి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఐతంలో గ్రంథాలయ పితామహుని జయంతి"

విశాలాంధ-టెక్కలి : ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ రంగనాథన్ జయంతి వేడుక సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు పూలను సమర్పించి నివాళు లర్పించారు. అనంతరం, ఆయన గ్రంథాలయ ఆవశ్యకత, నిర్వహణ ప్రాధన్యతల ను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తో పాటు ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ కన్వీనర్ డాక్టర్ సిజె రావు, గ్రంథాలయాధికారి డాక్టర్ ఎంవి సుబ్బారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్వోను కలిసిన టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు

విశాలాంధ్ర-టెక్కలి: ఇటీవల నూతనంగా టెక్కలి తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన దిలీప్ చక్రవర్తి ను సోమవారం టెక్కలి మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. అనంతరం తహసిల్దార్ కు పుష్పగుత్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజలకి అందుబాటులో ఉంటూ ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన రెవెన్యూ పరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా మరికొన్ని అంశాలపై చర్చించినట్లు ఆమె తెలిపారు.

ఏఎస్ఐ నాగభూషణరావుకు ఇండియన్ పోలీస్ మెడల్

విశాలాంధ్ర - నరసన్నపేట: పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన బెహరా నాగభూషణరావు ఇండియన్ పోలీస్ మెడల్‌కు అర్హత పొందారు. సోమవారం పోలీస్ వర్గాలు అందించిన సమాచారంలో మేరకు 1984వ సంవత్సరంలో ఏ.ఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయిన నాగభూషణరావు 2023వ సంవత్సరానికి సంబంధించిన పోలీస్ పురస్కారాల్లో ఈ పురస్కారం దక్కింది. ఈ మెడల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఈనెల 15వ తేదీన అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ పోలీస్ మెడల్‌కు అర్హత పొందిన నాగభూషణరావుకు నరసన్నపేట సి.ఐ, శ్రీనివాసరావు, ఎస్.ఐ, బి.అశోక్‌బాబు, పోలీసు సిబ్బంది అభినందనలు తెలియచేశారు.

ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

జేబీటి విద్యార్థులు ర్యాలీ

విశాలాంధ్ర-జలుమూరు: 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 15న ప్రతి ఒక్క ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సారవకోట మండలం అవలింగి జేబీటి పాఠశాల విద్యార్థులు సోమవారం అవలంగి చీడిపూడి బుడితి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ మాట్లాడుతూ మన దేశ చరిత్రను గుర్తించి స్వాతంత్ర దినోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



విశాలాంధ్ర-జలుమూరు: మండలం శ్రీముఖలింగం గ్రామంలో సోమవారం గిరిదారి ఫిల్లింగ్ స్టేషన్ వద్ద అందత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో బొంగు దొరబాబు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 50 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 22 మంది చికిత్సకు ఎంపికయ్యారని, వీరిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో చికిత్స జరుగుతుందని వైద్యాధికారిణి రుచిత తెలిపారు. మరికొందరిని పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

గ్రంధాలయ దినోత్సవం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: గ్రంథాలయ శాస్త్ర పితామహులు ఎస్ ఆర్ రంగనాథన్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం గ్రంధాలయ విభాగం ఆధ్వర్యంలో "నేషనల్ లైబ్రెరియన్స్ డే" ఘనంగా నిర్వహించారు. కళాశాల గ్రంథాలయాధికారిని మొదలవలస ఇందువదన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి. సత్యనారాయణ గ్రంథాలయ అధికారుల ఆవశ్యకతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ రోణంకి హరిత, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి.వి. రమణ, సంస్కృత అధ్యాపకులు ఓ. రామారావు, ఇంగ్లీష్ అధ్యాపకులు అంబటి సూరిబాబు పాల్గొనిరి. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చలో శ్రీకాకుళం దళితుల ఐక్యత వర్ధిల్లాలి!

- రాజ్యాంగపు హక్కులకు రక్షణ కల్పించాలి

- రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. బెంజమిన్

జెడ్పీ ఎదురుగా నిరసన తెలియజేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్రపతి వారు వెంటనే నిలుపుదల చేయాలని దేశంలో ఉన్న 44 కోట్ల దళిత ప్రజలు కోరుతున్నారని రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం అన్నారు. నిరసన కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో చేపట్టి మాట్లాడుతూ, 100 సంవత్సరాల క్రితం డా. బి.ఆర్. అంబేద్కర్ నిర్మించిన ఈ ఐక్యత, మధ్య భావాలు కలకాలం వర్ధిల్లాలి అంటే వారి మధ్య ఐక్యత ముఖ్యులు, వారి విముక్తికి అనే మార్గాలని, దృష్టవశాత్తు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా దెబ్బ తీస్తుందన్నారు. ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి, ఆర్టికల్ 2115 పూర్తిగా విరుద్ధం. రాజకీయ ప్రభావాలతో యిచ్చిన తీర్పుగా 11కోట్ల దళిత ప్రజలు ఆందోళన చెందుతూ ఉన్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు తేది 01-04-2003 వెలువడింది. ఇప్పటివరకు పార్లమెంట్ లో ఉన్న ఏ రాజకీయ పార్టీ ఈ తీర్పుపై నోరు విప్పలేదు. సుప్రీం కోర్టునుగాని, కేంద్ర ప్రభుత్వంను గాని నిలదీయలేదు. ఈ పార్లమెంటులో మైనారిటీ ప్రజల రాజ్యాంగపు హక్కులకు రక్షణ ఉండదా, దేశంలో 1100 షెడ్యూల్డు కులాలు ఉన్నాయి. వాటిలో మాదిగ కులం ఒకటి. ఈ ఒక్క కులం విభజన కోరితే, రాజ్యాంగ విరుద్ధంగా ఈ కులాలన్నింటినీ విభజిస్తారా? ఇది పూర్తిగా అగ్రకుల రాజకీయ పార్టీల, నాయకుల కుట్ర, ఈ కుట్రలో మాదిగ కులమును పావుగా వాడుకుంటూ, ఈ విభజన కుట్రను గత 30 సంవత్సరాలుగా అగ్రకులాలు పెట్టుబడి పెట్టి అధికార మర్విని యోగానికి పాల్పడి నడుపుతూ ఉన్నారనేది విభజనలో అనుసరించిన విధానాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. అందుచేతనే ఈ విభజన తీర్పును అన్ని షెడ్యూల్డు కులాల! తెగలు పూర్తిగా వ్యతిరేకిస్తూ ఉన్నాయన్నారు. భారత పార్లమెంటులో కులాల తెగలకు చెందిన 100 మంది ఎం.పి.లు ఉన్నారు. 44కోట్ల దళిత ప్రజల రాజ్యాంగపు హక్కులు కాపాడవలసిన బాధ్యత వారిపై ఉంది. ఈ ప్రజల రాజ్యాంగపు హక్కులు కాపాడవలసిన అధికారం రాష్ట్రపతి వారిదని తెలిపారు. 100 మంది ఎం.పి.లు రాష్ట్రపతి వారికి మెమెరాండంను సమర్పించి ఈ కోర్టు తీర్పును వెంటనే నిలుపుదల చేయాలని కోరుతున్నాము. రాజ్యాంగపు హక్కులకు రక్షణ కల్పించాలని యావత్భారతదేశ దళిత ప్రజలు కోరుతున్నారన్నారు.. రాజ్యాంగ విరుద్ధ సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ శ్రీకాకుళం పట్టణంలో జిల్లా దళిత ప్రజలంతా తేది 17-8-2024 శనివారం నాడు నిరసన కార్యక్రమము జరుపుతున్నారని కావున ఈ కార్యక్రమములో పాల్గొనవలసినదిగా అన్ని ప్రజా సంఘాలను, దళిత సంఘాలను, దళిత ప్రజలను హక్కులు అడుక్కుంటే రావని నిరంతర పోరాటంతోనే సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

శ్రీకూర్మం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీకూర్మనాథ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మండలంలోని శ్రీకూర్మం ఆలయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం.. అధికారుల నిర్లక్ష్యానికి గురై కునారిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూర్మావతార రూపంలో మహావిష్ణువును చూసేందుకు వచ్చే భక్తులకు.. పెచ్చులూడుతున్న గోడలు, నాచుపట్టిన శ్వేత పుష్కరిణి, నిరుపయోగంగా మారిన ధర్మసత్రం.. స్వాగతం పలుకుతున్నాయని చెప్పారు. పుణ్యక్షేత్రాన్ని ఆధునీకరించేందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుతో చర్చిస్తానని తెలిపారు. అనంతరం శ్వేత పుష్కరిణిని పరిశీలించి నాచు తొలగించాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు ఇక్కడకు వస్తుండడంతో ఆలయ పరిసరాలు, పుష్కరిణి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది, అర్చకులు, పాల్గొన్నారు.

గ్రామ దేవత అసిరి తల్లి ఆలయానికి విద్యుత్ సరఫరా చేయండి

విశాలాంధ్ర-జలుమూరు: జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామ దేవత అసిరి తల్లి దేవాలయానికి విద్యుత్ సరఫరా చేయాలని ఆ గ్రామస్తులు సోమవారం స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ని వినతి పత్రం ద్వారా కోరారు ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించుకున్న ఈ ఆలయం గ్రామస్తులందరికీ ఉపయోగకరమని అక్కడికి వెళ్లేందుకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు విద్యుత్ సరఫరా వేనందున సాయంత్రం వేళలో ఆ ప్రాంతం అంధకారంతో కనిపిస్తుందని శాసనసభ్యులు పరిశీలించి గ్రామ దేవత ఆలయంవరకు విద్యుత్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం) లో అందిన అర్జీలకు నాణ్యతతోకూడిన సత్వర పరిష్కారాన్ని అందించాలని, అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన అహమ్మద్ ఖాన్ జిల్లా రెవిన్యూ అధికారి అప్పారావు, డిఆర్డిఎ, పి.డి కిరణ్, జిల్లా పరిషత్ సిఇఓ వెంకటేశ్వర రావు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ధరఖాస్తులను నాణ్యతతోపాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ (మీ కోసం) నిర్వహణ పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అందునిమిత్తం అర్జీల పరిష్కారానికి ఒక నిర్ణీత ప్రొఫార్మా ఇవ్వడం జరిగిందని ఆ ప్రొఫార్మాకిలోబడి అర్జీల పరిష్కారం చేపట్టాలని అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో వాటి పరిష్కారానికి సంబంధించిన అర్జీని వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. మీకోసం ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో కెఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, జిల్లా పంచాయతీ అధికారి వేంకట్యశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి.మీనాక్షి, డ్వామా పి.డి చిట్టి రాజు, ఎస్.ఇ కార్పొరేష్ ఇ.డి గడేమ్మ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కులగణన జరగాలి

కలెక్టర్‌కు వినతి అందజేసిన జాతీయ రెల్లి, గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు

విశాలాంధ్ర-అరసవల్లి: అశాస్త్రీయంగా చేపట్టిన కులగణన కారణంగా రెల్లికులస్తులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, శాస్త్రీయంగా కులగణన జరగాలని జాతీయ రెల్లి, గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు జాతీయ ప్రధాన కార్యదర్శి పి సుధాకర్, పట్టణ కార్యదర్శి అర్జి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు గొల్లపిల్లి మోహనరావులు డిమాండ్ చేశారు. ముందుగా పాతబస్టాండ్ నుంచి జిల్లా పరిషత్ వరకు శ్రీకాకుళం నగరంలోని రెల్లి సామాజిక వర్గ 12 ఉపకులాలకు చెందిన ప్రజలు వేలాదిగా పాల్గొని ర్యాలీ నిర్వహించారు. నగరంలోని జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ద్వారా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో జాతీయ రెల్లి, గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో 2000-2004 వరకు ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ కొనసాగించారు. ఎస్సీ- ఎ రెల్లిగ్రూపు కులాలకు కేటాయించిన ఒక్కశాతం రిజర్వేషన్ రోస్టర్ నెం.2 ప్రకారం మహిళలకు కేటాయించడం వలన తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీని వలన రెల్లిగ్రూపులో ఉన్న పురుషులకు వివిధ విద్యాసంస్థల్లో, వివిధ శాఖల ఉద్యోగాల్లో అవకాశం లేక తీవ్రమైన అన్యాయానికి గురయ్యామని కలెక్టర్‌కు వివరించారు. దీంతో సుప్రీంకోర్టు 2004 నవంబరు 5న చట్టాన్ని సమీక్షించి ఎస్సీ ఎ, బీ, సీ, డీ చట్టాన్ని రద్దు పరిచారన్నారు. ఇటువంటి తీర్పులో 59 ఎస్సీ ఉపకులాలలో అందరికంటే విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక, ఆర్థికంగా అట్టడుగులో ఉన్న రెల్లిగ్రూపు కులాల సమాగ్రాభివృద్ధికి ప్రత్యేకమైన అవకాశాలు కల్పించాలని కోరారు. రెల్లికులాలకు ప్రత్యేకమైన విద్యాసంస్థలు ప్రారంభించి, విద్యాపరంగా అభివృద్ధి చేయాలన్నారు. రెల్లిగ్రూపు కులాల ఉపాధి అవకాశాల మెరుగుకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రెల్లి గ్రూపు కులాల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి వారిని అభివృద్ధి పరచాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ అనివార్యమైతే ఎస్సీల్లోని 59 కులాల వారిని కులగణన చేసి తరువాత ఎస్సీ 59 కులాల్లో అధికసంఖ్యలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన రెండు ఒంటరి కులాలైన మాల, మాదిగ కులాలను ఒక గ్రూపులో చేర్చాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ర్యాలీలో జలగడుగుల శ్రీరామ, కళ్యాణి వెంకటరావు, జె గోవిందరావు, అరుగుల గణేష్, అర్జి జ్యోతికుమార్, నల్లపిల్లి కష్ట, జె శ్రీనివాసరావు, కవ్వాడి రవి, ఆకుల అప్పారావు, ధనాల రమణ, అరుగుల నాగేశ్వరరావు, బైరిశెట్టి బుజ్జిరాజు, ఎన్ హరి, పొట్నూరు గోపి, పొట్నూరు గణేష్, తుపాకుల రవి, నల్లపిల్లి కాంచనమ్మ, అరుగుల రాజులమ్మ, బంగారి రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బ పేటలో మెడికల్ క్యాంపు

పారిశుద్ధ్య పనులు మెరుగుపరుస్తాం డిపిఓ

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇసుక పాలెం పంచాయతీ పరిధి సుబ్బ పేటలో డెంగ్యూ జ్వర పీడి తులు అధికంగా ఉండడంతో ఇటీ వల మంచం ఎక్కిన సుబ్బ పేట శీర్షికన వెలువడిన కథనంతో అధి కారులు స్పందించారు. రెండు రోజు లుగా మెడికల్ క్యాంపు సరుబుజ్జిలి పిహెచ్సి అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా పంచా యతీ అధికారి వెంకటేశ్వరరావు పారిశుద్ధ్య పనులను పరివేక్షించి పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తు న్నట్లు వివరించారు. గ్రామంలో నెలకొన్న అపారిశుద్యాన్ని ట్రాక్ట ర్లతో తొలగించారు. జ్వర పీడితు లు పూర్తిగా నయమయ్యే వరకు క్యాంపు నిర్వహిస్తామని వైద్యా ధికారి తెలిపారు. గ్రామంలో ఇంటింటా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. వీరికి అంద రికీ వైద్య సదుపాయాల అంది స్తున్నారు. గ్రామంలో బ్లీచింగ్ క్లోరినేషన్ పనులు చేస్తున్నారు. అలాగే వ్యాధుల ప్రబలకుండా చూసేందుకు యంత్రాంగం సం యుక్తంగా కృషి చేస్తున్నారు. రెండు రోజులు పాటు మెడికల్ క్యాంపు నిర్వహించి క్లోరినేషన్ చేయాలని అలాగే తాగునీటి పైపులు మురికి కూపాల్లో ఉండ టం వల్ల మంచినీరు లభ్యం కావ డం లేదని తక్షణమే వాటిని మర మ్మతులు కూడా చేయించాలని స్థానిక వైసీపీ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ బద్రి రామారావు అధికారులను కోరారు.

ఉపాధ్యాయులకు పాఠశాలలకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సర్దుబాట్లులలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఇటు ఉపాధ్యాయులకు అటు పాఠశాలలకు న్యాయం జరిగేలా చూడాలని శ్రీకాకుళం జిల్లా ఒరియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గూగుల్‌మీట్ సమావేశంలో దొళాయి మాట్లాడారు. బైలింగ్ పాఠశాలల్లో మీడియం వారీగా ఉపాధ్యాయుల పోస్టులు కేటాయించాలని కోరారు. పూర్తిగా ఒడియా మీడియం పాఠశాలల్లో తొలగించిన స్కూల్ అసిస్టెంట్ ఒడియా, తెలుగు, అలాగే ఒరియా పండిట్ పోస్టులను పునరుద్ధరించాలని కోరారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పేద విద్యార్థులకు బ్యాగ్స్ నోట్ పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-పొందూరు: మండలం లోలుగు గ్రామ ఉపహార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సుమారు 334 మంది కి ఆ సంస్థ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ రంజిత్ కుమార్ పాణి చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వచ్చే ఏడాది విద్యా రంగంలో ప్రతి పిల్లవాడు మంచి ఉత్తీర్ణత శాతం చూపించాలని ఆయన కోరారు. కష్టపడి చదివినప్పుడే ఫలితం అద్భుతంగా ఉంటుందన్నారు. నేటి తరం విద్యార్థుల చదువు రేపటికి దేశానికి వెలుగు కావాలని ఆశించిన ఆశయాలు తీర్చాలని ఆయన కోరారు. జూనియర్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులతో పాటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బ్యాగు పాఠ్యపుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపహార్ ఏరియా మేనేజర్ బి ఎం పాల్, కో ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటర్ లోపింటి అప్పారావు, మోహన్, ఉగాది, స్వాతి, శ్రీనివాసరావు, మాలతి, నిర్మల రాణి, శాంతి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

చిలకపాలెం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం లోని చిలకపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం. అప్పలరా జును సస్పెన్షన్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ గ్రామాన్ని సందర్శించిన సమయంలో పారిశుధ్య పరిస్థితులు బాగోలేదని పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. అలాఏ ఈవోపీఆర్డీ దేవికి షోకాజు నోటీసు ఇచ్చారన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో ఉన్న టెక్కలి శాఖా గ్రంధాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఏర్పాటుకు విశేష కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి లైబ్రేరియన్ అధికారి రూపవతి, విశ్రాంత లైబ్రేరియన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రంగనాథం సేవలను గురించి కొనియాడారు. అలాగే వివిధ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి లైబ్రేరియన్లు వైకుంఠం రావు, ప్రసాదరావు, పాఠకులు, స్థానికులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తు అనంతర పరిస్థితులపై అధ్యయనం అవసరం

ప్రొఫెసర్ బాల నిక్కు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: భూకంపాలు, అటవీ అగ్నిప్రమాదాలు, పెను తుఫాన్లు వంటి విపత్తులు సంభవించిన అనంతర పరిస్థితులపై అధ్యయనం అవసరమని థాంప్సన్ రివర్స్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ మరియు హ్యూమన్ సర్వీసు అధ్యాపకుడు ప్రొఫెసర్ బాల నిక్కు (కెనడా) అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సోమవారం రీసెర్చ్ ఫారం నిర్వహించిన సమావేశంలో విపత్తులు-స్థితిస్థాపకత భవిష్యత్ అనే అంశంపై ఆయన ప్రసగించారు. విపత్తుల అనంతరం ప్రజల స్థితిగతులు, జీవరాశుల ఉనికి, మంచి నీటి లభ్యత, మౌళిక వసతులు తదితర అంశాలపై పూర్తిగా దృష్టిసారించి అధ్యయనాలు జరిపితే రాబోయే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. క్షేత్ర స్థాయి బాధితులు, మత్స్యకార కుటు బాలతో కలిసి అధ్యయనం చేస్తే వాస్తవ నివేదికలు వస్తాయన్నారు. భారత్ కంటే కెనడా, ఫిలిప్పైన్స్ తదితర దేశాల్లో విపత్తుల అనంతరం జరిగే అధ్యయనాలు వేగవంతంగా, సుదీర్ఘమవుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ విపత్తుల అనంతర పరిస్థితులపై ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంస్థలు, విద్యాలయాలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ జేఎల్ సంధ్యారాణి, డాక్టర్ జి.రామకృష్ణ, డాక్టర్ ఎల్. విజయకుమార్, డాక్టర్ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి సాగునీరు తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: నారాయణపురం ఆనకట్ట కుడి కాలువ క్రింద సంతకవిటి, పొం దూరు, ఎచ్చెర్ల మండలాల్లో సుమారు 20 వేల ఎకరాలు ఆయకట్టు పరిధిలోని రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు తో కలసి కలెక్టర్ గ్రీవెన్స్ కు వినతి పత్రం అందించారు. ప్రతి సంవ త్సరం జులై నెలలో ఆయకట్టుకు అధికారులు సాగు నీరు విడుదల చేసేవారు, అలాగే రైతులు జులై నెలలోనే ఖరీఫ్ సాగుకు వరి నాట్లు వేయడం పూర్తి చేయడం జరిగేది. ఈ సంవత్సరం మరమ్మ త్తులు పేరుతో ఈరోజు వరకు సాగు నీరు విడుదల చేయలేదు. అందువలన సోమవారం వరకు నాట్లు వేయలేదు, ఎదజల్లిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. అలాగే ఆలస్యంగా నాట్లు వేయడం వలన ఖరీఫ్ పంట దిగుబడి తగ్గిపోయే ప్రమా దం వుంది.అలాగే కాలువ మర మ్మత్తు పనులు చేస్తున్న కాంట్రా క్టర్ కాలువలో గుర్రపు డెక్కను తొలగించి బయటకు వేయకుండా కాలువ ఒడ్డునే లోపలి భాగంలో పడివేయు చున్నారు. దీనివలన ఎటువంటి ఉపయోగం లేదు సరి కదా, కాలువలో నీటిని విడిచి పెట్టిన తరువాత తొలగించిన గుర్రపు డెక్క వ్యర్థం మొత్తం కాలువలోనే ప్రవహించి చిన్న కాలువలకు వెళ్లే మార్గంలో మరియు కల్వర్టులలో ఇరుక్కు పోయి నీటి ప్రవాహానికి అడ్డుపడే అవకాశం వుంది.ఈ విషయాల న్నింటిపై కలెక్టర్ తో మాట్లాడటం జరిగింది. కలెక్టర్ వెంటనే దీనిపై ఇరిగేషన్ ఇంజనీర్ ని పిలిపించి నాసిరకంగా పనులు జరుగుతు న్న కారణంగా తక్షణమే నిధులు నిలుపుదల చేయాలని, అలాగే ఈ ఖరీఫ్ కు వెంటనే నీటిని విడు దల చేయాలని ఆదేశాలు ఇవ్వ డం జరిగింది. ఈ కార్యక్రమంలో పొందూరు మండల రైతులు, వైఎ స్సార్ సీపీ నాయకులు పాల్గొన దం జరిగింది.